క్లుప్తంగా

సరిపడా యూరియా సరఫరా చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

సుజాతనగర్: రైతులకు సరిపడా యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం అయిందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ ఆరోపించారు. ఆ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సొసైటీ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. మాట్లాడుతూ యూరియా కోసం రైతులు నెల రోజులుగా పడిగాపులు కాస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రానికి కేటాయించిన కోటా ప్రకారం యూరియా సరఫరాను చేయడంలో కేంద్రం విఫలమైందన్నారు. ఇప్పటికైనా రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కున్సోత్ ధర్మా, వీర్ల రమేష్, నల్లగొప్పు పుల్లయ్య, చప్పిడి వెంకటేశ్వర్లు, లింగయ్య, సత్యనారాయణ, బచ్చల కూర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాండురంగారావుకు సన్మానం



పాండురంగారావును సన్మానిస్తున్న నాయకులు

జూలూరుపాడు: జూలూరుపాడు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్, అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన కొమ్మినేని పాండురంగారావును గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు దుద్దుకూరి సుమంత్ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాళ్లూరు వెంకటేశ్వరరావు, గాదె కృష్ణయ్య, కల్యాణపు నరేష్, కాళ్లూరు ప్రవీణ్, జవ్వాది వీరరాఘవులు, కంచర్ల హరీష్, కొమ్మినేని కృష్ణమూర్తి, బానోత్ నరసింహారావు, మద్దెబోయిన నాగరాజు, గ్రామస్తులు పొన్నెకంటి వెంకటేశ్వర్లు, తూము కోటయ్య, వేల్పుల గోపాలకృష్ణ, యల్లంకి తిరుపతిరావు, యల్లంకి రవి, పానుగుపాటి వీరభద్రం, వేల్పుల శివరామకృష్ణ, దొప్ప సత్యనారాయణ, ఆనగంటి ధనమయ్య, బోడా హరిబాబు పాల్గొన్నారు.

రైళ్లను పునరుద్ధరించండి..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం నుంచి బెల్గావి ఎక్స్‌ప్రెస్, కాజీపేట రైళ్లను పునరుద్ధరించాలని కోరుతూ గురువారం భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ ఏఓ రాజేంద్రబాబును కలిసి సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ వై.శ్రీనివాసరెడ్డి వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ మణుగూరు నుంచి తిరుపతి, షిర్డీకి ప్రత్యేక రైలు నడపాలని, కాకతీయ ఎక్స్‌ప్రెస్‌ను మణుగూరు వరకు నడపాలని, కొత్తగూడెం ప్రగతి మైదాన్ రాజీవ్ పార్క్‌కు వెళ్లే దారిని రీఓపెన్ చేయాలని పేర్కొన్నారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. విలేకరులకు, సీనియర్ సిటిజన్స్‌కు రైళ్లలో ఉచిత ప్రయాణం కల్పించాలని కోరారు.

నేడు సీతారాం ఏచూరి మొదటి వర్ధంతి సభ

సింగరేణి(కొత్తగూడెం): సీపీఎం జాతీయ నాయకులు సీతారాం ఏచూరి మొదటి వర్ధంతి సభ ఈనెల 12న కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో నిర్వహించబడుతుందని, ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున పట్టణ ప్రజలు, సీపీఎం నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆదమరిస్తే అంతే సంగతులు..



టేకులపల్లి సెంటర్ కేటీసీ రోడ్డుపై గుంత

టేకులపల్లి: మండల కేంద్రంలోని టేకులపల్లి – కేటీసీ ప్రధాన రహదారి శ్రీ లక్ష్మీనరసింహ పూజాస్టోర్ ఎదురుగా రోడ్డుపై ప్రమాదకరంగా గుంత ఏర్పడింది. కోయగూడెం ఓపెన్ కాస్టుకు బొగ్గు లారీలు ప్రతీరోజు వందకు పైగా వచ్చిపోతుంటాయి. నెలల తరబడి ఈ గుంతను ఇటు సింగరేణి అధికారులు, అటు పంచాయతీరాజ్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇరుకైన రోడ్డు, డివైడర్ ఉండటం, నిత్యం వాహనాలు రోడ్డుపై ఉండటంతోపాటు ప్రమాదకరంగా గుంతలు ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గుంత వద్ద ఇప్పటికే పెను ప్రమాదాలు తప్పాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గుంతను పూడ్చి వేయాలని స్థానికులు కోరుతున్నారు.

పని ఎక్కువ.. జీతం తక్కువ

- ఆందోళన బాట పట్టనున్న కాంట్రాక్ట్ కార్మికులు
- కోర్టు తీర్పు అమలు చేయాలని డిమాండ్
- స్పందించని యాజమాన్యం



నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): ఈ సంవత్సరం సింగరేణి 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తితో సుమారు రూ.5 వేల కోట్ల లాభాలు ఆర్జించిందని సంస్థ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. అయితే ఈ లాభాల్లో 80 శాతం కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ ఉందని, ఇందులో 15 శాతం చెల్లించాలని కాంట్రాక్ట్ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇవ్వకపోతే ఆందోళన బాటకు సిద్ధమవుతామని హెచ్చరిస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెల 7న హైదరాబాద్‌లో భారీ సదస్సు నిర్వహించారు. దీంతోపాటు సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు.

నాడు రెండు విభాగాలు,
నేడు 56 విభాగాల్లో కాంట్రాక్ట్ కార్మికులు...

79 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో పర్మనెంట్ ఉద్యోగాలను విస్మరించి కాంట్రాక్ట్ వ్యవస్థను పెంచి పోస్తున్నాయి కొన్ని పరిశ్రమలు, నాడు ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల్లో లక్షలాది మంది పనిచేసిన కంపెనీలలో నేడు వాటి స్థానంలో కాంట్రాక్ట్ కార్మికులు, అవుట్ సోర్సింగ్ వ్యవస్థ విస్తరించింది. దీనిలో ప్రధానంగా నాడు సింగరేణి సంస్థలో 1.42 లక్షల మంది కార్మికులు పనిచేసిన సింగరేణి సంస్థలో నేడు సుమారు 40 వేల మంది మాత్రమే పనిచేస్తున్నారని, అంతే కాకుండా గతంలో 1997లో 100 మందితో ప్రారంభమైన కాంట్రాక్ట్ వ్యవస్థ, నేడు 56 విభాగాల్లో 35 వేల మందికి విస్తరించింది. దీనిలో ప్రధాన అంశం గనుల్లో కాంట్రాక్ట్ కార్మికులు చేయకూడని పనులను సైతం యాజమాన్యం చేయిస్తోందని, ఇది డిప్యూటీ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డీజీఎంఎస్) నిబంధనలను విరుద్ధమని పలువురు చర్చించుకుంటున్నారు. ఒక పర్మినెంట్ కార్మికుడి వేతనంలో 8 మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారని యాజమాన్యం అనుకుంటోందని కార్మికులు అనుమానిస్తున్నారు.

సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలని డిమాండ్...

సింగరేణి కార్మికుల వేతనాల పెంపు జేబీసీసీఐలో కార్మికుల జీతాలతోపాటు, కాంట్రాక్ట్ కార్మికులకు కూడా కోలిండియాలో అమలు చేస్తున్న హైపవర్ వేతనాలు అమలు చేయాలని 2013లో 9వ వేజ్ బోర్డ్ సమయంలో ఒప్పందం కుదిరింది. కానీ అది కాగితాలకే పరిమితం అయింది. అంతేకాకుండా పేస్‌లలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు పర్మనెంట్ కార్మికులతో సమానంగా వేతనం ఇవ్వాలని 2018లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది.

అయినా సింగరేణి స్పందించలేదు. కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు ఈ అంశాలపై పోరాటాలు సాగించకుండా లేనిపోని ఆందోళన బాట పడుతున్నాయని కార్మికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా కనీసం పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయకపోవటం బాధాకరమని కార్మికులు వాపోతున్నారు.

లాభాల వాటా ఇచ్చేదాకా..



పర్మనెంట్ కార్మికులతో పాటు సమానంగా గనులు, పేస్‌లలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు 15శాతం లాభాల వాటా కచ్చితంగా అమలు చేయిస్తామని, యాజమాన్యం అంగీకరించేంత వరకు ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపడతాము.

– సంజీవ్, ఇఫ్టూ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి

ఉద్యోగ భద్రత కల్పించాలి..



సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలి. ఉద్యోగ భద్రత, పనిస్థలాల్లో రక్షణ కల్పించాలి. హైపవర్ వేతనాలు అమలు చేయాలి. వివిధ విభాగాలలో 35 వేల మంది కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతన చట్టాలు అమలు చేయాలి.

– నాగేశ్వరరావు, ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి

పదేళ్లుగా జీతం పెరగలేదు...



కేంద్రంలో, రాష్ట్రంలో కార్మికులు, ప్రజల ఓట్లతో గద్దెనెక్కిన ప్రభుత్వాలు ఎన్నికల హామీలను విస్మరించటం పరిపాటిగా మారింది. కాంట్రాక్ట్ కార్మికులకు పదేళ్లుగా జీతం పెంచకపోవడం గర్హనీయం. దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారు.

– సతీష్, టీయూసీఐ నాయకుడు

గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు నోరువిప్పాలి



ఏజీఎం మురళీధర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం ప్రకటించబోయే లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు 15శాతం వాటా కేటాయించాలని గురువారం సింగరేణి హెడ్డాఫీస్ ఎదుట ఇఫ్టూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కార్పొరేట్ ఈఈ సెల్ హెచ్ఓడీ మురళీధర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ రాసుద్దీన్, జీఎల్‌బీకేఎస్ జనరల్ సెక్రటరీ జే.సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి వెంకన్న మాట్లాడుతూ సింగరేణిలో 40 వేల మంది పర్మనెంట్ కార్మికులు, 32 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని, యాజమాన్యం అన్ని విభాగాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు అతి తక్కువ వేతనాలు చెల్లిస్తోందని, పర్మనెంట్ కార్మికుల కంటే ఎక్కువ పనిచేయిస్తోందన్నారు. దీనివల్ల కంపెనీకి రూ.కోట్ల లాభాలు వస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కంపెనీకి వచ్చిన లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు 15శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు తక్కువగా ఇస్తున్న సంగతి తెలిసినా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు నోరుమెదపడం లేదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను ఒకవైపు ప్రభుత్వాలు, మరోవైపు యూనియన్లు మోసం చేస్తున్నాయని, ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి వీరికి 15శాతం వాటా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఏజీఎం సమస్యలను ఉన్నతాధికారులకు వివరించి పరిష్కారమార్గం చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మానందం, గౌని నాగేశ్వరరావు, ఎస్.సంజీవ్, మోత్కూరి, మల్లికార్జున్‌రావు, యాదగిరి, కృష్ణవేణి, టి.శ్రీనివాస్, అంజయ్య, కృష్ణ, నరసింహా, వెంకన్న, శ్రీనివాస్, రాజు, సదానందం, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడుతాం..



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

పాల్వంచరూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి, సేవల కోసం ఎంతవరకైనా పోరాటానికి సిద్ధంగా ఉన్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. స్థానిక పట్టణంలోని లేక్‌యూ ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగిన స్వచ్ఛ పక్షం జిల్లా కార్యశాల సమావేశం జరిగింది. మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం పురస్కరించుకుని ఈనెల 17నుంచి వచ్చే నెల 2 వరకు జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున రక్తదాన శిబిరాలు, చిన్నారులకు వ్యాసరచన పోటీలు, యువకులకు మారథాన్ పరుగు పోటీలు, మొక్కలు నాటడం, స్వచ్ఛభారత్ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే నాయకులకు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో యాపా సీతయ్య, స్వచ్ఛ సేవా జిల్లా కన్వీనర్ పసుమర్తి సతీష్‌కుమార్, మాజీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్, కుంజ ధర్మారావు, గొడుగు శ్రీధర్, యాదవ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బహుజన బతుకమ్మ పోస్టర్ల ఆవిష్కరణ



బహుజన బతుకమ్మ ప్రచార పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

పాల్వంచరూరల్: ప్రకృతిని విధ్వంసం చేయడమంటే ప్రజలపై యుద్ధం చేసినట్లే అని ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీవిముక్తి) రాష్ట్ర కన్వీనర్ పగిడేరు అరుణక్క, రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెల్తూరి సదానంద అన్నారు. ఉల్వనూరు గ్రామంలో గురువారం బహుజన బతుకమ్మ ప్రచార వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ ప్రకృతి విధ్వంసాన్ని అడ్డుకోవాలని, శాంతి స్వావలంబనకు ఈనెల 20 నుంచి వచ్చే నెల 3 వరకు బహుజన బతుకమ్మ కార్యక్రమం జరుగుతుందని, 25వ తేదీన ఉల్వనూరు గ్రామంలో జరగనున్న బహుజన బతుకమ్మ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్పొరేట్ సంస్థల లాభాల కోసం భారత దళారీ పాలకవర్గాలు ఊడిగం చేస్తూ బహుజన సంస్కృతిని ధ్వంసం చేస్తున్నాయన్నారు. సహజ సంపద దోపిడీకి ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను హతమారుస్తూ అభయారణ్యాల పేరుతో ఆదివాసీలను అడవుల నుంచి బయటకు వెళ్లగొడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అడవుల్లో ఉండాల్సిన జంతువులు గ్రామాల్లోకి రావడం వలన ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని, కోతుల బెడదతో పంటలు, నివాసాలు ధ్వంసం అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం వరంగల్ జిల్లా కన్వీనర్ యుగేందర్, పీఓడబ్ల్యూ నాయకురాలు వాసం రుద్ర, కొండన్న, మంగయ్య దొర పాల్గొన్నారు.

ఓటేసిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు



సింగరేణి(కొత్తగూడెం): ఓటింగ్‌లో పాల్గొన్న కార్మికులు



ఇల్లెందు: ఓటు వేస్తున్న కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 11, 12 తేదీలలో సింగరేణి వ్యాప్తంగా చేపట్టిన సొంతిల్లు కావాలా.. కంపెనీ క్వార్టర్ కావాలా.. కార్యక్రమానికి గురువారం విశేష స్పందన లభించింది. కొత్తగూడెం ఏరియా పీవీకే-5 ఇంక్‌లైన్ గని ఆవరణలో కార్మికులు స్వచ్ఛందంగా బ్యాలెట్ ఓటింగ్‌లో పాల్గొని సొంతిల్లు గుర్తుపై టిక్ చేసి ఓటు హక్కు వినియోగించుకున్నారని ఆ యూనియన్ బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ పేర్కొన్నారు. యాజమాన్యం నిరంకుశంగా ఈ కార్యక్రమం జరగకుండా ఉండేందుకు కింద స్థాయి అధికారులకు గేటు బయటనే నిర్వహించాలని ఎన్నో ఆంక్షలు విధించి, ఆదేశాలు జారీ చేసిందని అయినప్పటికీ కార్మికుల సహకారంతో షరతులను పక్కన పెట్టి, ఓటింగ్‌లో పాల్గొన్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు, సింగరేణి కోల్‌బెల్ట్ ఏరియా ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు సొంతింటి పథకం అమలు చేస్తామని హామీలు ఇచ్చారని అవి అమలుకు నోచుకోకపోవడంతో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఓటింగ్‌లో పాల్గొనటం విశేషమన్నారు. ఈ కార్యక్రమం కొత్తగూడెంలోని అన్ని డిపార్ట్‌మెంట్లలో విజయవంతం అయిందని తెలిపారు. వై.వెంకటేశ్వరరావు, గడల నరసింహారావు, భూక్యా రమేష్, బాలరాజు, నందిపాటి రమేష్, అనందరావు, ప్రమోద్ పాల్గొన్నారు.

ఇల్లెందు: సింగరేణి కార్మికులకు సొంత ఇంటి కల నెరవేర్చాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఓపెన్ బ్యాలెట్ కార్యక్రమం నిర్వహించగా కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొని తమ అభిప్రాయం తెలిపినట్లు ఆ సంఘం జిల్లా నాయకులు ఎస్ఏ నబీ తెలిపారు. గురువారం జేకే ఓసీ, జీఎం కార్యాలయంలో నిర్వహించిన ఓపెన్ బ్యాలెట్ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించిందన్నారు. అయితే సింగరేణి యాజమాన్యం ఈ కార్యక్రమం నిర్వహించకుండా కార్మికులను సహకరించకుండా గేట్ల వద్ద ఆంక్షలు అమలు చేశారని పేర్కొన్నారు. లాభాల వాటా 35 శాతం చెల్లించాలని, సొంత ఇంటి పథకం అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడిన రూ.42 వేల కోట్లు రికవరీ చేయించాలని యాజమాన్యాన్ని కోరారు. కార్మికుల మారుపేర్ల సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి అబ్బాస్, కృష్ణ పాల్గొన్నారు.


నేడు పెసా గ్రామసభ

ఇల్లెందురూరల్: మండలంలోని సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం పంచాయతీ ఎక్స్‌టెన్షన్ షెడ్యూల్డ్ ఏరియా (పెసా) గ్రామసభ నిర్వహిస్తున్నట్లు పంచాయతీ ప్రత్యేకాధికారి బాలాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ పరిధిలోని అటవీ, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఉన్న భూములను సింగరేణి సంస్థకు అప్పగించే ప్రక్రియ ప్రజామోదం పొందేందుకు గ్రామసభ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 10:30కు ప్రారంభమయ్యే గ్రామసభకు ప్రజలు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

డీఎస్ఓ పోస్టును భర్తీ చేయండి..

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో అర్ధాంతరంగా నిలిపివేసిన డీఎస్ఓ పోస్టును తక్షణమే భర్తీ చేసే విధంగా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేయాలని ఎమ్మెల్సీ పింగలి శ్రీపాల్‌రెడ్డి, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నికోలస్‌ను కోరారు. గురువారం నికోలస్‌ను కలిసి పలు సమస్యలపై విన్నవించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల్లో స్కావెంజర్లు వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారని, వేతనాలు వారి సొంత బ్యాంకు ఖాతాలలో జమయ్యే విధంగా చూడాలని కోరారు.

గుండెపోటుతో మృతి



బాబు (ఫైల్)

పాల్వంచరూరల్: ప్రజాప్రతిఘటన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో దళకమాండర్‌గా పదేళ్లు పనిచేసిన వజ్జ బాబు (56) గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. రేగులగూడెం గ్రామానికి చెందిన వజ్జ బాబు 2002లో పోలీసుల ఎదుట లొంగిపోగా ప్రభుత్వం ద్వారా పునరావాసం కింద వాహనాన్ని తీసుకుని జనజీవన స్రవంతిలో కలిశారు. బుధవారం అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుండెపోటు రావడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య వెంకటలక్ష్మి, కుమార్తె ఝాన్సీ, కుమారుడు రోహిత్ ఉన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి..



మాట్లాడుతున్న మాధవనాయక్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) జూలై 23 నుంచి సెప్టెంబర్ 12 వరకు కార్మిక ప్రజాందోళన కార్యక్రమాల్లో భాగంగా పలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టిందని, ఇందులో భాగంగా 12న సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నామని ఆ యూనియన్ జాతీయ కార్యదర్శి పి.మాధవ నాయక్ తెలిపారు. గురువారం స్థానిక బీఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కోలిండియా, సింగరేణి సైనీ బ్లాక్‌లను కాపాడాలని, బొగ్గు ఉత్పత్తిలో కనీసం 50శాతం కంపెనీ పర్మనెంట్ కార్మికులే పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం నుంచి సింగరేణికి రావాల్సిన రూ.42,739 కోట్లు వెంటనే కంపెనీ చెల్లించాలని, కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు హైపవర్ వేతనాలు, ఉచిత వైద్యసేవలు, కంపెనీ క్వార్టర్, సీఎంపీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.

బహుజన రాజ్యస్థాపనకు కృషి చేయండి..



నరసింహారావుకు నియామకపత్రం అందజేస్తున్న కామేష్

పాల్వంచ: బహుజన రాజ్య స్థాపనకు ప్రతీఒక్కరు కృషి చేయాలని జైభీమ్‌రావ్ భారత్ పార్టీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యర్రా కామేష్ అన్నారు. గురువారం పట్టణంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. దేశంలోని 85 శాతానికి పైగా జనాభా ఉన్న బహుజనులంతా ఒక్క తాటిపైకి రావాలన్నారు. అగ్రవర్ణాల కనుసన్నలల్లో నడిచే పార్టీల్లో కార్యకర్తలు ఉండి, కార్యకర్తలుగా మిగిలిపోయే రోజులు పోయాయని, ఒక నిర్దేశిత లక్ష్యంతో విశాల దృక్పథంతో ఏర్పడిన పార్టీ జేబీపీ అన్నారు. అనంతరం ఎర్రగుంటకు చెందిన నిట్ట నరసింహారావును పట్టణ అధ్యక్షుడిగా నియమించారు. అనంతరం పార్టీలో చేరిన 30 మందికి కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నాయకులు బొల్లం రఘు, వంక వసంత్, చాణక్య, నిట్ట వరుణ్, కొలుకుల పవన్, గుడివాడ ఆదిత్య ఉన్నారు. కార్యక్రమంలో గంధం మల్లికార్జునరావు, నాగుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

సుజాతనగర్: తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిగా ప్రజలు పోరాటానికి సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా సుజాతనగర్‌లో రావి నారాయణరెడ్డి స్తూపం వద్ద అమరవీరులకు గురువారం నివాళులర్పించారు. మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చరిత్రలో అపూర్వమైన అధ్యాయం అన్నారు. పేదరైతుల భూదాన నిర్మూలన, జమీందారీ వ్యవస్థ కూల్చివేత కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన పోరాటయోధుల త్యాగాలు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. ఈ పోరాటం వలనే వేలాది ఎకరాల భూమి పేదలకు పంచబడిందని, పల్లెల్లో గణనీయమైన సామాజిక మార్పులు చోటుచేసుకున్నాయని వివరించారు. రావి నారాయణరెడ్డి, మగ్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి, బొమ్మగాని ధర్మభిక్షం, చాకలి ఐలమ్మ వంటి సాయుధ పోరాట యోధుల విగ్రహాలు, స్మారక కేంద్రాలను ప్రభుత్వం ఒకే ప్రదేశంలో ఏర్పాటు చేయాలన్నారు. 17న జిల్లా, రాష్ట్ర స్థాయిలో పెద్దఎత్తున విలీన దినోత్సవం జరుపుతామని తెలిపారు. కార్యక్రమంలో కొమారి హన్మంతరావు, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, భూక్యా దస్రు, జక్కుల రాములు, తాళ్లూరి పాపారావు, వీర్ల మల్లేష్ పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు సీఈఓను నియమించండి..

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓను వెంటనే నియమించాలని మైనారిటీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ.యాకూబ్ పాషా గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. హైకోర్టు ఆదేశానుసారం రాష్ట్ర ప్రభుత్వం సీఈఓగా విధులు నిర్వహిస్తున్న అసదుల్లాను తొలగించి నెల గడిచిందని అయినప్పటికీ, ప్రభుత్వం నేటి వరకు నూతన సీఈఓను నియమించలేదని, దీని కారణంగా వక్ఫ్ బోర్డులో పాలన గాడి తప్పుతోందన్నారు. వక్ఫ్ భూముల కబ్జాదారుల ఫిర్యాదులు జీతాభత్యాలు, పెన్షన్లు, ఇమాం, మౌజన్ల గౌరవ వేతనాల వంటివి నిలిచిపోయాయని, సీఈఓ లేని కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి వస్తున్న ఫిర్యాదుదారులు వెనుదిరిగి వెళ్లావలసి వస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వక్ఫ్ బోర్డు సీఈఓగా ఐఏఎస్ స్థాయి అధికారిని నియమిస్తే వక్ఫ్‌బోర్డ్ పాలన గాడినపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కాంట్రాక్టు కార్మికులకు 15 శాతం బోనస్ చెల్లించాలి



ధర్నాలో మాట్లాడుతున్న సీతారామయ్య

కొత్తగూడెంఅర్బన్: సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఎస్‌సీసీడబ్ల్యూ - ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో గురువారం సింగరేణి హెడ్డాఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ రాసుద్దీన్ అధ్యక్షత వహించారు. జీఎల్‌బీకేఎస్ జనరల్ సెక్రెటరీ జె.సీతారామయ్య, ఎస్‌సీసీడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి ఏ.వెంకన్న మాట్లాడుతూ సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సింగరేణి లాభాలలో 15 శాతం లాభాల వాటాను బోనస్‌గా చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో 40వేల మంది రెగ్యులర్ కార్మికులు, 30 వేలమంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నట్లు చెప్పారు. అతి తక్కువ వేతనాలతో కాంట్రాక్ట్ కార్మికులు విధులు నిర్వహించడం వలన సింగరేణికి లాభాలు వస్తున్నాయన్నారు. 2013 నుంచి కోల్ ఇండియాలో అమలు చేస్తున్న హైపవర్ కమిటీ వేతనాలు సింగరేణిలో చెల్లించాల్సి ఉండగా సింగరేణి యాజమాన్యం మొండికేస్తోందని హెచ్‌పీసీ వేతనాలకై సంతకం పెట్టిన జేబీసీసీఐ సంఘాలు, సింగరేణిలో గెలిచిన గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు నోరు మెదపటం లేదన్నారు. కాంట్రాక్టు కార్మికులను నమ్మించేందుకు గెలిచిన సంఘాలు వేతనాలు పెంచుతామని మాట్లాడుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులకు హైపర్ కమిటీ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే నాలుగేళ్లుగా సింగరేణి యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ చిట్టీలు ఇవ్వాలని, సింగరేణి వ్యాప్తంగా 213 మంది సులభ్ కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్ చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం సులభ్ ఇంటర్నేషనల్ సోషల్ ఆర్గనైజేషన్ పేరుతో సాగిస్తున్న శ్రమ దోపిడీకి అండగా ఉంటుందని దీనిని యాజమాన్యం విడనాడాలని, కార్మికుల సాధారణ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ కంపెనీ క్వార్టర్, ఓటు హక్కు కల్పించాలని, జాతీయ పండుగ సెలవులు అమలు చేయాలని కోరారు. సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల బోనస్, హైపవర్ వేతనాలు లేదా సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం సమాన పనికి సమాన వేతనం 8 గంటల పని, ఈఎస్ఐ, యూనిఫాం, సేఫ్టీ తదితర సమస్యలను పరిష్కరించకపోతే తిరిగి చలో హైదరాబాద్ సింగరేణి భవన్ ముట్టడికి పూనుకోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి.బ్రహ్మానందం, రాష్ట్ర సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి ఎస్.సంజీవ్, ఉపాధ్యక్షుడు మోత్కూరి మల్లికార్జునరావు, రాష్ట్ర నాయకులు యాదగిరి, కృష్ణవేణి, బెల్లంపల్లి రీజియన్ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్, ఆజర్ల అంజయ్య, కృష్ణ, నరసింహ, వెంకన్న శ్రీనివాసు, రాజు, సదానందం, రాజేశ్వరి, జోరు నరేష్, బొడ్డు దేవేందర్ నాయకత్వం వహించగా సింగరేణి 11 ఏరియాలకు చెందిన 200 మంది కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.